## మహిళలకు రక్షణ లేదా?



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** కాంగ్రెస్ పాలనతో తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ... తాజాగా మహిళా పారిశ్రామికవేత్త శోభారెడ్డి ఓ వ్యక్తిపై చేసిన వేధింపుల ఆరోపణలను తీవ్రంగా పరిగణించాల్సిన అంశమన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

## దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కోసం సత్యాగ్రహ దీక్ష



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని కోరుతూ సోమవారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష జరిగింది. దీక్షకు సికింద్రాబాద్ సెల్ విభాగం మద్దతు తెలుపడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ జి.స్వరూప మాట్లాడుతూ.. మతం మారినంత మాత్రాన దళితులపై వివక్ష పోదని.. అందుకే దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. ఈ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఎస్‌సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో రిటైర్డ్ డిజి బాబురావ్, రెవ రాజేశ్వర్‌రావ్, రెవ పుర్షోత్తమ్‌రావు, రెవ జోనాథన్, స్వరూప, నవీన్, ఇజ్రాయెల్, బెనర్జీ, రాజేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సస్పెన్షన్




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ఓ కానిస్టేబుల్ నగదు లెక్కిస్తున్నట్లు వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో సంబంధిత అధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈ క్రమంలోనే బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో నగదు లెక్కించిన కానిస్టేబుల్ అరుణ్‌ను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణకు రవాణా శాఖ కమిషనర్ ఆదేశించారు. అంతే కాకుండా ఆర్టీవో కార్యాలయాలలో ఏజంట్లను అనుమతించడంతో పాటు, సరైన పర్యవేక్షణ కొరవడటం వంటి ఆరోపణలతో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్, ఆర్టీవో రామ్‌చందర్‌ను తక్షణమే బాధ్యతల నుంచి తప్పిస్తూ రవాణా శాఖ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేసింది.

## పోలీసుల కవాతు..



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** రానున్న గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం విధుల్లో పాల్గొనే అదనపు సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలు, మధురానగర్ ఎస్‌హెచ్‌ఓతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించుకోవాలి

**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జోనల్ టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ సంతోష్ కుమార్, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 209 దరఖాస్తులు




**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** ప్రజావాణిలో మొత్తం 209 దరఖాస్తులు వచ్చాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులన్నింటిని శాఖల వారీగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా చేయూత ఫించన్ల వెరిఫికేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తహసిల్దార్లను ఆమె ఆదేశించారు. ఈ ప్రక్రియ పరిశీలనలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సిఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సమీక్షించిన ఆమె వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు ప్రవీణ్‌కుమార్, ఆశన్న, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు. సుధీర్

## వికారాబాద్ 117 దరఖాస్తులు స్వీకరణ

**ప్రజాపక్షం /వికారాబాద్ :** కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతల నుండి వచ్చిన ప్రజల నుండి 117 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తీపక్తి వారీ తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావానికి వచ్చిన ప్రతి దరఖాస్తును సకంలో పరిశీలించాలని కోరారు. భూ సమస్యలు ,ఫించన్లు ,విద్యా, వైద్యం ఉపాధి, రహదారులు ,వాంటిపై స్వీకకరించడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు సకలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటచారి ,ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్ ,డిఆర్ఓ స్వర్ణలత ,జెడ్పి సీఈఓ సుధీర్ తదితరులు పాల్గోన్నారు.

# బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కరువు

### ఎఐయుసి ఆధ్వర్యంలో భారీ ధర్నా



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఏఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ విమర్శించారు. సోమవారం మార్కెట్ హమాలి యూనియన్ కార్మికులు మార్కెట్ ఆవరణలో నిర్వహించిన భారీ ర్యాలీ, ధర్నాలో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో మార్కెట్ నిధులు ప్రభుత్వ ట్రెజరీకి మళ్ళించడం ద్వారా ప్రతి రూపాయి ట్రెజరీ ద్వారా తీసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న అభివృద్ధి పని చేయాలన్న చేయలేకపోతున్నారని వారు విమర్శించారు. నిత్యం వేలాదిమంది రైతులు, హమాలీలు, వ్యాపారస్తులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉండటం వలన పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో నిత్యం మార్కెట్‌లోనే ఉండే హమాలీలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కనీస సౌకర్యాల కల్పన విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. తక్షణం ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని మార్కెట్‌ను అభివృద్ధి చేయకపోతే మార్కెట్‌ను పూర్తిగా బంద్ చేసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇదిలాఉండగా.. ధర్నా వద్దకు వచ్చిన బోయిన్పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డిబి దేవేందర్ ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకన్న హమాలీలతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో గట్టిగా మాట్లాడి నెల రోజుల లోపు మార్కెట్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. కార్యక్రమంలో హమాలి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఏ.గట్టయ్య, ఉపాధ్యక్షులు సమ్మయ్య, రాజు, లింగం, రాజయ్య, కార్యదర్శులు శ్రీశైలం కొమురయ్య తదితరులతో పాటు దాదాపు వందల సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు

## వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత

### విద్యుత్ సరఫరాపై సిఎండి క్షేత్రస్థాయి సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ:** వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ స్పష్టం చేశారు. సోమవారం వ్యవసాయ విద్యుత్ సరఫరాపై క్షేత్రస్థాయిలో టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ నల్గొండ జిల్లాలోని జైకేసారం(చౌటుప్పల్ సెక్షన్), ఆరెగూడెం (చియ్యల్ సెక్షన్) 33/11 కేవీ సబ్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా, ఫీడర్ల పనితీరు, నిర్వహణ చర్యలను పరిశీలించిన సీఎండీ, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆరెగూడెం సబ్‌స్టేషన్‌లో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామంలో వరి పొలాలను సందర్శించి బోర్‌వెల్‌ల ద్వారా సాగునీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పొలాల్లోనే రైతులతో ముఖాముఖి సమావేశమై పంటల సాగు పరిస్థితులు, నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసు కున్నారు. తదనంతరం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని మాడుగులపల్లి మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో సీఎండీ సమావేశమై జిల్లాలో విద్యుత్ సరఫరా పరిస్థితి, వ్యవసాయ అవసరాలు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రైతులకు అందిస్తున్న సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. సిఎండి పర్యటన లో రూరల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, నల్గొండ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో పిఎఫ్ గాయబ్?

### సుమతీ సంస్థపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** జలమండలిలో 2021వ సంవత్సరంలో రెండు నెలలకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ చెల్లించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమతీ కార్పొరేట్ సర్వీసెస్ సంస్థపై ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నాయకులు మరోసారి జలమండలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్ని పర్యాయాలు ఫిర్యాదులు చేసినా సంబంధిత ఏజెన్సీ నుంచి స్పందన లేదని ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న సంబంధిత అధికారుల పర్యవేక్షణపైనా సమగ్రంగా పరిశీలన జరగాలని కోరారు. రెండు నెలల పీఎఫ్ మొత్తాలు ఉద్యోగుల ఖాతాల్లో జమ కాకపోవడం వల్ల ఉద్యోగుల పీఎఫ్ రికార్డులు, సేవా కాలానికి సంబంధించిన ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పీఎఫ్ మొత్తాలు సకాలంలో జమ కాకపోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగులకు లభించే పీఎఫ్ సంబంధిత ప్రయోజనాలు, పెన్షన్ ప్రయోజనాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఇకనైనా పరిష్కరించకుంటే యూనియన్ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని నాయకులు బోర్డు అధికారులను హెచ్చరించారు.

## తాగునీటి వృథాపై జరిమానాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నీటిని పొదుపుగా వాడండి...ఒక్క చుక్కనూ వృథా చేయొద్దు.. అంటూ జలమండలి పదేపదే అవగాహన కల్పిస్తోంది. అయినా కొందరిలో మార్పు రావడం లేదు.తాగునీటితో ఫ్లోర్లు కడగడం... వాహనాలు శుభ్రం చేయడం... నల్లాలు తెరిచి వదిలేయడం... ఓవర్ హెడ్ ట్యాంక్ నిండినా పట్టించకపోవడం..జరుగుతోంది. ఇదంతా అవగాహన లేకనా? లేదంటే ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నారా? అనేది అర్థం కావడం లేదు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ప్రాంతంలో జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాగునీటిని అనవసరంగా వృథా చేస్తున్న ఐదుగురు వినియోగదారులను గుర్తించి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. తనిఖీల సందర్భంగా రోజువారీ పనుల్లో కేవలం ఒక్క నిమిషంలోనే ఎంత నీరు వృథా అవుతుందో వివరించే కరపత్రాలను చూపిస్తూ వినియోగదారులకు అవగాహన కల్పించారు. పలువురు వినియోగదారులు నీటి వినియోగంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించడం సానుకూల పరిణామమని అధికారులు తెలిపారు. నీటి వృథాను అరికట్టేందుకు జరిమానాలు విధించడం అవసరమైన చర్యేనని కొందరు వినియోగదారులు స్వయంగా అభినందించారు.

## అడుగడుగునా భక్తి పారవశ్యం







**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** పంచముఖ సంకటహర ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గత మూడు రోజులుగా హైదరాబాద్ నలుమూలల నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీయులు భారీగా తరలివస్తున్నారు. దీంతో ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణం భక్తజన సందోహంతో జనసంద్రంగా మారింది. మహాగణపతి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరుతున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇదిలాఉండగా... రహదారులు, గల్లీలు, బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ అనే తేడా లేకుండా వాడవాడల ఏర్పాటైన వినాయక మండపాల్లో కొలువైన గణనాథులను ప్రజలు పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే రాజీవ్‌నగర్ గణేశ్ మండపం వద్ద సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపం నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కిలారి మనోహర్ దంపతులు తదితరులు పాల్గొన్నారు. బేగంబజార్ ఫీల్‌ఖానాలో విశ్వ విజయ్ మిత్ర మండల్ సహస్ర మోదకం 51 నారికేల్ అష్ట ద్రవ్య మహా గణపతి హోమం వానర్ సేన గణపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. పూజా కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, పవన్ పూజారి, మహావీర్ శర్మ ముఖ్యఅతిథులుగా హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలాఉండగా.. వినాయక ఉత్సవాలలో భాగంగా రాజీవ్‌నగర్ గణేశ్ మండపం వద్ద సోమవారం సుమధుర ఇరా అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు, కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీనివాస్ బోగిశెట్టిని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిలారి మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కాగా పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన వినాయక మండపాలను, ముఖ్యఅతిథిగా సందర్శించిన కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైద్రాబాద్ కమిటీ ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీకాంత్, సుధీర్ జాదవ్, వెంకటేష్, వినాయక మండపం కార్యనిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు

### అక్టోబర్ 11 నుంచి తిరుపతిలో శతాబ్ది ఉత్సవాలు : కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** దళితులు హిందూ దేవాలయంలోకి ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చిన చారిత్రక ఘటనకు వందేళ్లు పూర్తయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.1925 అక్టోబర్ 13న దాసరి మురుగన్ అనే పంచముడు తొలిసారిగా హిందూ దేవాలయంలోకి ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చారని అన్నారు. ఈ ఘటనపై అప్పట్లో సెక్షన్ 295 కింద కేసు నమోదు చేసి తిరుపతి జైలులో ఉంచారని తెలిపారు. విషయం తెలుసుకున్న రాజగోపాలాచారి తిరుపతికి వచ్చి కోర్టులో వాదనలు వినిపించడంతో మురుగన్కు శిక్ష పడకుండా చేశారని చెప్పారు. ఈ చారిత్రక ఘటనకు గుర్తుగా అక్టోబర్ 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో దళిత ఆలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశంలోని పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాలకు హాజరుకానున్నారని తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

## గాంధీ జయంతి ఏర్పాట్లను సమన్వయంతో చేయాలి

### డిఆర్ఓ డాక్టర్ నారాయణ



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:** గాంధీ జయంతి వేడుకలకు ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని డిఆర్ఓ డాక్టర్ నారాయణ తెలిపారు. హైదరాబాద్ కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గాంధీ జయంతి వేడుకల నిర్వహణపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు రెండో తేదీన గాంధీ జయంతి వేడుకల్లో రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అధికారులు వారి శాఖల వారీగా చేపట్టే ఏర్పాట్లను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. వేడుకల్లో నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులు, త్రాగునీరు, భారీ కేడింగ్, ఉద్యాన, అదే రోజు 11 గంటలకు సమావేశం ఉంటుందని, దీనికి చేపట్టే కార్యక్రమాల నివేదికలతో అధికారులు హాజరుకావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, గోల్కొండ లా అండ్ ఆర్డర్ ఏసిపి సయ్యద్ ఫయాజ్‌లతో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన చిల్లర ఘర్షణ

**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** ఆటో చిల్లర డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసి ఓ ఆటో డ్రైవర్ హత్యకు దారి తీసిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వట్టేపల్లికి చెందిన యూట్యూబర్ అజీమ్ తల్లి ఒంటరిగా మైలార్‌దేవ్‌పల్లికి వెళ్ళింది. తిరుగు ప్రయాణంలో ఆమె ఒక్కరే ఆటో ఎక్కింది. వట్టేపల్లికి రూ.100 కిరాయి మాట్లాడుకోగా, తన వద్ద రూ.200 నోటు ఉందని ఆమె ఆటో డ్రైవర్ ముఖరంకు తెలిపినట్లు సమాచారం. చిల్లర విషయంలో ఇద్దరి మధ్య ఆటోలోనే వాగ్వి వాదం జరిగింది. ఈ విషయాన్ని ఆమె తన కుమారుడు అజీమ్కు ఫోన్ చేసి చెప్పింది. దీంతో అజీమ్ మరో ఇద్దరితో కలిసి ఆటో కోసం వట్టేపల్లిలో ఎదురు చూడగా అప్పుడే అక్కడికి వచ్చిన డ్రైవర్ ముఖరంను యూ ట్యూబర్ మరో ఇద్దరితో కలిసి చితక బాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ముఖరం అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వినాయకుడి సన్నిధిలో అన్నదానం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సర్కిల్ 6వ డివిజన్ ఎన్ఎఫ్‌సి నగర్ బ్యూటీ నెక్స్ట కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అన్నదాతలు రాజు,రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భుక్తుల నుంచి విశేష స్పందన లభించింది.కాలనీలోని వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పడమటి సీతారాం రెడ్డి,ఎస్సై చంద్రశేఖర్, రాఘవేందర్, మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్ రెడ్డి,బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి,పాల్గొన్నారు.పలువురు భక్తులు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## రైతులకు నష్టపరిహారం అందించడం అభినందనీయం

### 57 మంది రైతులకు రూ.14లక్షల పంటనష్ట పరిహారం
### చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** చిట్టినాడు ఫ్యాక్టరి రైల్వే ట్రాక్ నిర్మాణం కారణంగా గత సంవత్సరం కురిసిన అకాల వర్షాలతో పంట నష్ట పోయిన సంగెం కలాన్ గ్రామ రైతులకు పంట నష్ట పరిహారం అందించడం అభినందనీయమని చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిలు అన్నారు. చిట్టనాడు సిమెంట్ కర్మాగారం ఆద్వారంయోల సోమవారం తాండూరు మండల పరిధి సెంగెంకలాన్ గ్రామానికి చెందిన సుమారు 57మంది రైతులు పంట నష్ట పోయిన రైతులకు రూ.14లక్షల పంట నష్ట పరిహారం చెక్కులను చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి ఇబ్బందులను గుర్తించిన సిమెంట్ కర్మాగారం యాజమాన్యం రైతులకు పంట నష్ట పరిహారం అందించడం అభినందనీయమన్నారు. పకృతి వైపరిత్యాల సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వారికి వసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టినాడు సిమెంట్ కర్మాగారం సిబ్బంది, బిజేపి జిల్లా పార్టీ అధ్యక్షులు రమేష్‌కుమార్,మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, స్థానిక నాయకులు, రైతులు పాల్గోన్నారు.

## 106 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించిన ప్రజావాణిలో 106 అర్జీలు దాఖలు చేసారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ధరఖాస్తుదారులు కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్‌కిస్తే అయినా మోక్షం లభిస్తుందన్న ఆశతో కదలి వచ్చి తమ వంతు కోసం ప్రజావాణిలో కలెక్టరేట్ కార్యాలయానికి చేరారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి జిల్లా కలెక్టర్ మనుచౌదరి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని అధికారులకు సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ ఆ వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఎంఎంసి మల్కాజిగిరి కమిషనర్ కార్యాలయంలో... జరిగిన ప్రజావాణిలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రజల నుండి 17 ధరఖాస్తులను స్వీకరించారు 9, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన 2, ఎస్టేట్స్, అర్బన్ బయోడైవర్సిటీ, శానిటేషన్, హెల్త్ విభాగానికి సంబంధించిన ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.